నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | ఏప్రిల్ 02, 2025 | www.navatelangana.com

రోడ్డుపై గుంత పూడ్చిన హోంగార్డు

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలో బెల్లంపల్లి చౌరస్తా నుండి వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా వైపు వెళ్లే మెయిన్ రోడ్డుపై వాహన దారులకు ఇబ్బందిగా మారిన గుంతను ట్రాఫిక్ హోంగార్డు వెంకటేష్ పూడ్చాడు. నిత్యం ఆ రోడ్డు గుండా ఎంతో మంది ప్రయాణం చేస్తుంటారు. రహదారి ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన గుంతలో ఇటుకలు వేసి పైనుండి సిమెంట్ కప్పి పూడ్చాడు. దీంతో ఆయనను పలువురు అభినందించారు.



ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మతి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ రూరల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలో గంజాల్ ముత్తన్న వ్యవసాయ భూమిలో మామిడి భూమన్న(56) ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఎస్ఐ లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం..గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కుళ్లిన స్థితిలో బావిలో ఉందనే సమాచారం మేరకు పోలీసులు అక్కడికెళ్లారు. బావి నుండి మృతదేహాన్ని తీయించి సోషల్ మీడియాలో షేర్ చేశారు. చనిపోయిన వ్యక్తి లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన భూమన్నగా గుర్తించారు. కుటుంబీకులను విచారించగా సదరు వ్యక్తి కొన్ని రోజుల నుండి మానసిక రుగ్మతతో బాధ పడుతున్నాడని తెలిపారు. శనివారం సాయంత్రం ఇంట్లో చెప్పకుండా వెళ్లాడు. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయాడని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



పేదోడి ఫ్రిజ్‌గా ఆదిలాబాద్ రంజన్‌లు..!

- తాజాగా అందుబాటులో రంగు రంగుల కుండలు
- ప్రభుత్వం గుర్తించాలని కుమ్మరుల ఆవేదన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎండా కాలం వచ్చిందంటే చాలు ఆదిలాబాద్ రంజన్లు, కుండలు గుర్తుకొస్తాయి. ఎక్కడ అమ్ముతున్నారో తెలుసుకొని మరీ కొనుగోలు చేస్తుంటారు. ఎందుకంటే రంజన్ నీళ్లు తాగితే ఆ మజాయే వేరు. పేదోడి ఫ్రిజ్‌గా చెప్పుకునే వీటికి మంచి డిమాండ్ ఉంది. నీటిని చల్లగా ఉంచడంతో పాటు చూడటానికి కూడా అందంగా ఉండడంతో వీటికి మంచి ఆదరణ ఉంది. మట్టితో తయారు చేస్తారు కనుక ఇందులోని నీటిలో ఔషధ గుణాలుంటాయి. ఇది ఆరోగ్యానికి చాలా మంచిదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. దీని తయారీలో నాణ్యత కలిగిన బంకమట్టిని సేకరించి పొడిగా కలుపుతారు. నీళ్లతో తడిపిన మిశ్రమాన్ని అలాగే కొద్ది రోజుల పాటు ఉంచుతారు. తర్వాత గుర్రపు లద్ది కలిపి రంజన్లను చేతితో తయారు చేసి ఆరబెడతారు. అలా ఓ క్రమపద్ధతిలో పేర్చి మంటల్లో కాలుస్తారు. బహిరంగ మార్కెట్లో రూ.150 నుంచి రూ.300, రూ.400 వరకు సైజును బట్టి రేట్లు ఉన్నాయి. ఈసారి రంగు రంగుల కుండలు ఆకర్షణగా నిలిచాయి.

కుండలకు ఇతర ప్రాంతాల్లోనూ గుర్తింపు

జిల్లాలో ఆదిలాబాద్‌రూరల్ మండలం బంగారుగూడ, ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త, పాత కుమ్మరివాడ, ఉట్నూర్ సమీపంలోని కుమ్మరికుంట, సిరికొండ, బేల తదితర ప్రాంతాల్లో వేసవి కాలంలో కుమ్మరులు రంజన్లు, కుండలు తయారు చేస్తారు. ఇక్కడ తయారు చేస్తున్న రంజన్లు, కుండలు ప్రముఖ నగరాలకు కూడా తీసుకెళ్తారు. ఆదిలాబాద్ రంజన్లకు, కుండలకు ఇతర రాష్ట్రాల్లోనూ డిమాండ్ ఉంది.

ఆరోగ్యపరంగా మట్టికుండలే మేలు

మట్టితో తయారు చేసే రంజన్లలోని నీళ్లు తాగేందుకు పేదలతో పాటు వైద్య పరిజ్ఞానం ఉన్న ప్రతి ఒక్కరూ వేసవిలో ప్రాధాన్యత నిస్తారు. మట్టికుండలు, రంజన్లలోని నీటిని తాగేందుకే ఆసక్తి కనబరుస్తారు. మట్టితో తయారు చేసిన రంజన్లలోని నీళ్లను తాగితే ఆరోగ్యపరంగా మంచి ఫలితాలు ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.

కష్టమైనా వృత్తిని కాపాడుతున్నాం : కుమ్మరులు

ఏండ్లుగా రంజన్లను తయారు చేస్తున్నా తమను ప్రభుత్వాలు గుర్తించడం లేదని పలువురు కుమ్మరి కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తయారీ సమయంలో నడుము వంగిపోతుందన్నారు. పెరిగిన ధరలతో వృత్తిని కొనసాగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృత్తిని కాపాడాలనే లక్ష్యంతోనే ఎంత భారమైనా రంజన్లను తయారు చేస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఆదిలాబాద్ రంజన్లకు పెట్టింది పేరని, కానీ ఇక్కడి కుమ్మరులను మాత్రం ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మహారాష్ట్ర, గుజరాత్, యావత్మాల్ నుండి కుండలు తెచ్చి అమ్ముతున్నారని పేర్కొంటున్నారు.



దుకాణంలో రంగురంగుల కుండలు, రంజన్‌లు



కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఆరోగ్య పాఠశాల బృందానికి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో కలెక్టర్ రాజర్షి షా వైవిధ్య ఆలోచన రూపమైన ఆరోగ్య పాఠశాల ప్రత్యేక కార్యక్రమానికి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి స్కోచ్ అవార్డ్ దక్కింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆనందాన్ని వ్యక్తపరుస్తూ ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి అవార్డు వచ్చేలా పనిచేసిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వారిని అభినందించారు. ఇందులో డీఈఓ ప్రణీత, ఆరోగ్య పాఠశాల జిల్లా సంధానకర్త అజయ్, జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, డాక్టర్ వంశీ, డాక్టర్ శ్రీధర్, డీడబ్ల్యుఓ మిల్కా, రిసోర్స్ పర్సన్స్‌గా పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్, ప్రత్యూష, సత్యనారాయణ, పోచారెడ్డి, సిల్వేరి రాములు, వేణు, ప్రతాప్, రాహుల్ రాథోడ్ ఉన్నారు. ఇదే ఉత్సాహంతో ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని 2025-26 విద్యా సంవత్సరంలో జూలై మాసం నుండి డిసెంబర్ వరకు కూడా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. దానికి తగు చర్యలు చేపట్టాల్సిందిగా అందరినీ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని వంజర్ గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకపురం లచ్చన్న(72) మృతి చెందాడని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..వంజర్‌కు చెందిన లచ్చన్న, లక్ష్మన్, చందాల రమేష్ ద్విచక్రవాహనంపై అదే గ్రామంలో మరొకరింటికి వెళుతుండగా మార్గమధ్యలో కుక్కలు అడ్డం వచ్చాయి. వాహనం నడుపుతున్న రమేష్ సడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదం జరిగింది. రమేష్‌కు స్వల్ప గాయాలు కాగా లచ్చన్నకు తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మన్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. గాయపడ్డ లచ్చన్నను నిర్మల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శ్రీరాంపూర్ ఏరియాలో వార్షిక ఉత్పత్తి 92శాతం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో 2024-25 వార్షిక ఉత్పత్తి 92 శాతం సాధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024-25 వార్షిక సంవత్సరంలో శ్రీరాంపూర్ ఏరియాకు నిర్దేశించిన 63,10,000 టన్నులగాను 57,86,282 టన్నుల ఉత్పత్తి సాధించి 92 శాతం సాధించినట్లు తెలిపారు. భూగర్భగనుల్లో 16,10,000 టన్నులకు 14,42,337 టన్నులు, ఉపరితల గనులలో 47,00,000 టన్నులకు గాను 43,43,945 టన్నుల ఉత్పత్తి సాధించామన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో మూడు గంటలలో 100 శాతం ఉత్పత్తి పూర్తి చేశామని, సహకరించిన అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఈ వార్షిక సంవత్సరంలో అత్యధికంగా మార్చి 27,31 తేదీలలో 10 రేకులను డిస్పాచ్ చేసినట్లు తెలిపారు. రికార్డు స్థాయిలో ఒక్క రోజులోనే బొగ్గు ఉత్పత్తి 32వేల టన్నులు సాధించామని, అలాగే మార్చి నెలలో 147 శాతం ఉత్పత్తి సాధించామని, 187 రేకుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా 3784 మందికి కారుణ్య ఉద్యోగ అవకాశం కల్పించామన్నారు. అలాగే గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 65,16,000 టన్నుల లక్ష్యాన్ని రక్షణతో కూడిన ఉత్పత్తి 100 శాతం సాధించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, సీనియర్ పిఓ కాంతారావు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చంద్రమోహన్‌గౌడ్

నవతెలంగాణ-మంచిర్యాల



తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డా.ఉదారి చంద్రమోహన్‌గౌడ్ ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌలిలో అసోసియేషన్ ఎన్నిక నిర్వహించారు. దీనికి హైకోర్ట్ జస్టిస్ పి.నవీన్‌రావు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుండి 20 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఎన్నికల్లో చంద్రమోహన్‌కు మెజారిటీ రావడంతో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ సెక్రటరీగా సుకుమార్ ఫ్రాన్సిస్ గెలుపొందారు. తమ గెలుపుకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సెక్రటరీ పృథ్వీశ్వర్‌రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నికైన సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజులలో గ్రామీణ ప్రాంతాలలో సైతం బాస్కెట్ బాల్ అభివృద్ధికి దోహదపడతామన్నారు.

లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- పలు చోట్ల సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్

అర్హులైన లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంలో గల రేషన్ షాప్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. సన్న బియ్యం పంపిణీ తీరును పరిశీలించారు. లబ్ధిదారులతో ముచ్చటించారు. సన్న బియ్యం పంపిణీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, ఈజీఎస్ ఏపీఓ బాలయ్య ఉన్నారు.

ఆసిఫాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పథకాన్ని పకడ్బందీగా అమలు చేసే దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులకు తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేతో కలిసి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంలో పథకాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని, లబ్ధిదారులకు అందించడంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు వివిధ రకాల వస్తువులు అందిస్తామని గతంలో ఇచ్చిన హామీ కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య, రేషన్ డీలర్ల సంఘం జిల్లా నాయకుడు కేశవ్, రేషన్ డీలర్ శారద పాల్గొన్నారు.

మంచిర్యాల : రేషన్ కార్డు కలిగిన వారందరికీ సన్న బియ్యం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి పేద కుటుంబానికి సన్న బియ్యం చేరాలన్న చారిత్రాత్మక పథకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకం అని పేర్కొన్నారు . గతంలో దొడ్డు బియ్యాన్ని పేదలు తినకుండా అమ్ముకున్నారని, అందుకని అందరికీ ఉపయోగపడేలా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టారని, అందులో బాగంగానే గోదావరి రోడ్‌లో మహాప్రస్థానం, 600 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రోడ్ల విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్లు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.



జైపూర్ : బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్

బోథ్ : పేదవాడికి కడుపు నిండా అన్నం పెట్టే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మూడవ రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజుయాదవ్, శాకిర్, అబద్, మహ్మద్, షేక్ అబ్రహర్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ శ్రీదేవితో కలిసి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, డిసిసిబి డైరెక్టర్ నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, మాజీ చైర్మన్లు దశరథ రాజేశ్వర్, రాజ్ మహమ్మద్, నాయకులు ఓ.నారాయణరెడ్డి, నర్సారెడ్డి, రాజేశ్వర్‌రావు, చంద్రప్రకాష్‌గౌడ్, లక్ష్మారెడ్డి, శంకర్, సలీం, డీలర్లు నారాయణరెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : మండల కేంద్రంలో షాప్ నంబర్ 2లో ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని మంగళవారం జేడీసీసీ మాజీ సభ్యుడు మల్లెపూల నర్సయ్యతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ హీరాలాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్కం తిరుమల, కాంగ్రెస్ మండల కన్వీనర్ జల్కే పాండురంగ్, నాయకులు అరే పాండు, కిషన్, విఠల్, ఆర్ఐ రాథోడ్ నూర్‌సింగ్ పాల్గొన్నారు.



మంచిర్యాల : బియ్యం పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ



ఆసిఫాబాద్ : బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

బెట్టింగ్ ఆడినా, నిర్వహించినా కఠిన చర్యలు

- వన్‌టౌన్‌లో ఇద్దరిపై ఐపీఎల్ బెట్టింగ్ కేసు నమోదు
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ



ఆదిలాబాద్‌టౌన్ : బెట్టింగ్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. బెట్టింగ్, గేమింగ్‌కు అలవాటు పడి యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. బెట్టింగ్ నిర్వహించినా, బెట్టింగ్ యాప్స్‌తో ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై బెట్టి కేసు నమోదు కాగా ఆ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మంగళవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. మార్చి 31న పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా డైట్ గ్రౌండ్‌లో కొందరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లగా కచ్‌కంటి గ్రామానికి చెందిన జోగు సాయికుమార్ ఐపీఎల్ మ్యాచ్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏ2గా రామాయి గ్రామానికి చెందిన షేక్ సజీద్‌పై కేసు నమోదు చేశారు. ఏ1 ఫోన్‌ను పరిశీలించగా అతను ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో నమోదు చేసుకున్నట్లు, ఏ2 నుండి డబ్బు తీసుకుంటున్నట్లు తెలిసిందన్నారు. వీరి వద్ద నుండి రూ.1500, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత అక్రమ బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌లకు బానిసలుగా మారి, అప్పులపాలై ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్స్ వల్ల యువత ఆర్థికంగా దెబ్బతిని చివరికి సూసైడ్ చేసుకునే అవకాశం ఉందని, బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రవర్తనపై నిఘా పెట్టాలని, ప్రతి రోజూ పిల్లలు వారు చేస్తున్న పనుల గురించి ఆరా తీయాలని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, పట్టణ సీఐ బి.సునీల్ కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు ప్రజా పాలన చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆపి ప్రజా పాలన చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల ప్రభుత్వ భూముల వేలాన్ని ఆపాలని, భూముల అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలనే ఆలోచన మంచిది కాదని డిమాండ్ చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా రాజ్‌కుమార్‌తో పాటు విద్యార్థి, యువజన సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే ఆ గుడిసెలను తగులబెట్టి, నిర్బంధిస్తున్నారన్నారు. రాజ్‌కుమార్‌తో పాటు విద్యార్థి, యువజన నాయకులైన పాయిరాల రాములు, సత్యనారాయణను ముందస్తు అరెస్టు చేశారు.

కాసిపేట : తెలంగాణలో నిర్బంధాలు, అడ్డుగోడలు, ఆంక్షలుండవని, ప్రజలకు ఆరు గ్యారంటీలతో పాటు 7వ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని గొప్పగా చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో విఫలైందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. మంగళవారం సోమగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ, ప్రజా సంఘాల నాయకుల అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపాలనుకోడం కాంగ్రెస్ ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం కోసం రియల్ ఎస్టేట్ మాఫియా ప్రభుత్వంలాగా వ్యవహరిస్తోందన్నారు. ఆ భూములను కాపాడుకోవడం కోసం మంగళవారం పార్టీ ఛలో యూనివర్శిటీకి పిలుపునివ్వగా, పాల్గొనటానికి మంచిర్యాల జిల్లా నుంచి హైదరాబాద్ వెళుతున్న నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని ఖండించారు.

నస్పూర్ : హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగా పార్టీ నాయకత్వాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడాన్ని అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాల మీద, నాయకుల మీద నిర్బంధం పెరిగిందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ మాయ మాటలు చెప్పారని, అధికారం చేపట్టాక గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అనుసరిస్తోందని విమర్శించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | ఏప్రిల్ 02, 2025 | www.navatelangana.com

యువత సన్మార్గంలో నడవాలి : ఎమ్మెల్యే బొజ్జు

నవతెలంగాణ-ఖానాపూర్

యువత సన్మార్గంలో నడుస్తూ, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీర హనుమాన్ యాత్రలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశంలో భిన్న సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని, భిన్నత్వంలో ఏకత్వమని అన్నారు. ధర్మాన్ని కాపాడుకుంటూ మంచి మార్గం వైపు నడవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో కలిసి కట్టుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నూతనంగా ఉట్నూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బానోత్ జైవంత్‌రావు ఎన్నిక కావడంతో మంగళవారం ఉట్నూర్ బార్ అసోసియేషన్ సభ్యులు అందరూ కలిసి జైవంత్‌రావుని శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బార్ అసోసియేషన్ సభ్యులకు, ప్రజలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. తనపై నమ్మకంతో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.



రేషన్ షాపుల్లో నాణ్యమైన సన్న బియ్యం

- పంపిణీ ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు



ఆదిలాబాద్‌టౌన్ : సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదలకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా ప్రభుత్వం రేషన్ షాపుల్లో నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. శాంతినగర్‌లోని రేషన్ షాపు నెంబర్ 32లో సరకులు, రేషన్ కార్డుదారుల వివరాలను డీలర్ ధీకొండవార్ విశ్వనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే భాగ్యనగర్‌లోని షాప్ నెంబర్ 36లో పంపిణీ ప్రారంభించారు. అనంతరం ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీవ్ యువ శక్తి పథకంలో దరఖాస్తు చేసుకున్నారా లేదా అని అడిగి తెలుసుకుకొని చేయని వారు ఏప్రిల్ 15లోపు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారంటిల్లో భాగంగా పేదలకు రేషన్ బియ్యం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తుందన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడంతో తీసుకోవడానికి ముందుకు రావడం లేదని గమనించిన ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఉగాది పర్వదినాన సీఎం ఈ పథకాన్ని ప్రారంభించగా, ఏప్రిల్ ఒకటో తేది నుంచి జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో పంపిణీ చేపట్టామన్నారు. దీన్ని వల్ల ప్రభుత్వంతో పాటు లబ్దిదారులకు పలు రకాల లాభాలున్నాయని వివరించారు. బియ్యం అక్రమ రవాణను అడ్డుకోవడంతో పాటు పేదలకు సన్నబియ్యం అందించడంతో అది సద్వినియోగం అవుతుందన్నారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి విచారణ పూర్తి అయిందన్నారు. త్వరలోనే ప్రభుత్వం వాటిని అందించే అవకాశాలున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి వైపు మళ్లేందుకు ప్రభుత్వం రాజీవ్ యువశక్తి ద్వారా రుణాలను అందిస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో హర్డ్ కాపీలను అందించాలన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకోని వారి కోసం ప్రభుత్వం మరో అవకాశంగా గడువును ఈనెల 5 నుంచి 15కు పొడిగించిందన్నారు. ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాయాల్లో దరఖాస్తులు అందించవచ్చని, వారి కోసం ప్రత్యేకంగా అక్కడ హెల్ప్ డెస్కును కూడా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

24వ వార్డులో సన్న బియ్యం పంపిణీ...

ఉగాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న పేదలకు ఉచిత సన్నం బియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని 24వ వార్డు, తాటిగూడ, భాగ్యనగర్ కాలనీలో కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో 24వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు మానే శంకర్, కాంగ్రెస్ నాయకులు జైన్ లలిత్, సలీం, రాజు కాలనీవాసులకు బియ్యన్ని పంపిణీ చేశారు. అనంతరం కాలనీవాసులు తమకు సన్నం బియ్యం సరఫరా చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

నిర్మల్ : సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లాభం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్ రేషన్ దుకాణంలో జిల్లా కలెక్టర్ పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి నిరుపేదకు లాభం చేకూర్చే విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంలో అత్యధిక విలువ గల పోషకాలు, విటమిన్లు ఉంటాయని, వీటి ద్వారా రక్తహీనత, జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. రేషన్ బియ్యాన్ని ప్రజలు ఎవరు దళారులకు అమ్మవద్దని తెలిపారు. రేషన్ కార్డు లబ్దిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ సన్నబియ్యాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ తహసీల్దార్ రాజు, పౌరసరఫరాల శాఖ అధికారులు, డీలర్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్ : మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులు ఆహారభద్రత కార్డుదారులకు ఉచిత సన్న బియ్యాన్ని పంపిణీని ప్రారంభిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీష్‌రెడ్డి, పిడుగు స్వామి, అడ్డి రాకేష్‌రెడ్డి, తహసీల్దార్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీను నెరవేరుస్తూ, తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణం-2లో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుకగా తెల్ల రేషన్ కార్డు గల ప్రతి కుటుంబానికి సన్న బియ్యం అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన ఆత్రం సుగుణ...

పేదవారి కడుపు నింపడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్టు కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలం సాకెర(బి), పెర్కగూడ గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ పదేండ్లలో బీఆర్‌ఎస్ ఒక రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించడంతో పాటు కొత్త రేషన్‌కార్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ రోజు ప్రారంభించారని తెలిపారు. పేదలకు ఆహార భద్రత కల్పించడానికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. ఆమె వెంట నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

నిర్మల్‌రూరల్ : సన్న బియ్యం పంపిణీ పేదలకు వరమని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ రూరల్ మండలం భాగ్యనగర్ గ్రామంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీమ్‌రెడ్డి సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో సన్న బియ్యం పథకం అమలు పేదలకు వరమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే రాష్ట్రంలో పేదలకు సన్న బియ్యం పథకం అమలు జరిగిందన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో సన్న బియ్యం పథకం కింద లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మాజీ వైస్ ఎంపీపీ విలాస్, కుంట పద్మాకర్, నిలాయిపేట మాజీ సర్పంచ్ సాయన్న పాల్గొన్నారు.

కడెం : మండలంలోని కన్నాపూర్ గ్రామంలోని చౌక ధరల దుకాణం-1లో తెల్ల రేషన్ కార్డు గల కుటుంబాలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెల్ల రేషన్ కార్డు గల కుటుంబాలకు మంచి పౌష్టికమైన ఆహారాన్ని అందించాలనే సదుద్దేశంతో సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టిందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రేషన్ బియ్యం ఎవరు కూడా అమ్మకూడదని అలాగే రేషన్ బియ్యం సరఫరాలో ఎలాంటి అక్రమాలకు చోటు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం కన్నాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ పడిగెల భూషణ్, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు జొన్నల చంద్రశేఖర్ గుప్త, మాజీ జెడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, తక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, దేవేందర్‌గౌడ్, బబ్లు, చాంద్‌పాషా, సత్యం, మల్లయ్య అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సన్న బియ్యం ప్రారంభోత్సవానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఇక నుంచి సన్న బియ్యం అందించడమే తమ కళ అని ఆ కళ నెరవేరిందని అన్నారు. ఇన్ని రోజులుగా దొడ్డు బియ్యం ఇవ్వడం జరిగిందని, కానీ అందులో రాళ్ల దుమ్ముతో బియ్యం ఇచ్చేవారని ఈరోజు అటువంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. వీరి వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ పెంట రమణ, వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, గులాబ్, ప్రతాప్, సంతోష్ ఉన్నారు.



నిర్మల్ : సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఇంద్రవెల్లి :రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆకలి తీర్చడానికే సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ ఎం.ప్రవీణ్ ప్రారంభించారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని షాప్ నెంబర్-1, షాప్ నెంబర్-2, చౌక ధరల దుకాణంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే పథకాలు పేద ప్రజలకు చేరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని చౌక ధరల దుకాణం-1లో లబ్ధిదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాల ఫలాలు పూర్తి స్థాయిలో అందించడమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టారనీ తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్ సుజాతారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కదర్ల గంగా నర్సయ్య, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఎంఎ మాజిద్, మున్సిపల్ మాజీ చైర్మెన్ అంకం రాజేందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : మావల మండలంలోని వాఘాపూర్ గ్రామంలో మంగళవారం సన్న బియ్యం పంపిణీని కాంగ్రెస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నక్కల పోతారెడ్డి, ఎర్రోజి ఆశన్న, రేషన్ షాప్ డీలర్, తొడసం శంకర్, మావల మండలం ఓబీసీ సెల్ అధ్యక్షుడు గోస్కూరి రాజేందర్ యాదవ్, మావల మండలం ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మర్సకోల గౌతమ్, కుందూరు రాజేశ్వర్, గ్రామప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంబి : మండల కేంద్రంతో పాటు మందపల్లి గ్రామంలో సన్నబియ్యం కార్యక్రమాన్ని తహసీల్దార్ లక్ష్మణ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నిల్‌రెడ్డి ప్రారంభించారు . సన్నబియ్యంతో పాటు నిత్యావసర సరుకులు కూడా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ శత్రుఘన్, శంకర్, రమేష్, కార్తీక్ పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలో 5వ నెంబరు చౌక ధరల దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. అనంతరం మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చలివేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్‌చంద్ర, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రామారావు, మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేల : మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ కవిత, బ్లాక్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు సంజయ్ గుండావార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండవార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీని ఈ రోజు కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే, ఎస్సీ సెల్ అధ్యక్షులు విఠల్ దేవతడే, గట్ల రవి, అక్తర్, కరీం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కడెం : సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఉట్నూర్ : సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ



బోథ్ : సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నిర్మల్ రూరల్ : సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీమ్‌రెడ్డి

సూపర్ స్పెషాలిటీలో స్పెషలిటిస్టులను తీసుకొస్తున్నాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ సూపర్ స్పెషాలిటి ఆస్పత్రిలో మెరుగైన సేవలను అందిస్తు వివిధ రకాల స్పెషలిటిస్టులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం సూపర్ స్పెషాలిటిలో మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ సేవలను ఆయన ప్రారంభించారు. ఇటీవల ఈ విభాగంలో డాక్టర్ రాథోడ్ వివేక్‌ను నియమించడంతో సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇప్పటికే న్యూరో, పిడియాట్రిక్, యురాలజీ, ఈఎన్టీ, క్యాన్సర్, ప్లాస్టిక్ సర్జరీ లాంటి సేవలు అందుబాటులో ఉన్నాయని డైరెక్టర్ తెలిపారు. దీనికి తోడు గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలను ప్రజల సౌకర్యార్థం ప్రారంభించామని తెలిపారు. కడుపులో ఎమైన సమస్యలున్న ఎండోస్కోపిక్ చేయడం చికిత్సలు అందించడం ఈ విభాగం పని చేస్తుందని వివరించారు. బాధితులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అశోక్, ఆర్ఎంఓ చంపత్‌రావు, రెడియాలజిస్ట్ కళ్యాణ్‌రెడ్డి, వైద్యులు నాగరాజు, జక్కుల శ్రీనివాస్, సత్యనారాయణ, దేవిదాస్, కార్తీక్ ఉన్నారు.

కాలినడకన సేవాలాల్ భక్తుల పయనం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బంజారాల పవిత్ర స్థలం మహారాష్ట్రలోని పౌరాదేవికి సేవాలాల్ భక్తులు కాలినడకన పయనమయ్యారు. సోమవారం నార్నూర్ మండలంలోని కొత్తపల్లి దీక్ష భూమి నుంచి ఈ పాదయాత్రను ప్రారంభించారు. సోమవారం రాత్రి మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామంలో బస చేశారు. ఉమ్మడి జిల్లా నలుమూలలనుంచి వచ్చిన బంజార భక్తులు కొత్తపల్లిలో ఏకమయ్యారు. అక్కడ నుంచి సేవాలాల్ భక్తులు మహిళలు, పురుషులు కఠిన నియమ నిబంధనలతో కాళ్లకు ఎలాంటి పాదరక్షకాలు ధరించకుండా మండు టెండల మధ్య మంగళవారం మండల కేంద్రంలో ప్రవేశించారు. మార్గమధ్యలో గుడిహత్నూర్‌లో సేదతీరారు. భక్తులకు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రం వైపు పయనమయ్యారు. కొత్తపల్లి నుంచి సుమారుగా 170 కిలోమీటర్ల పాదయాత్ర చేసి రామనవమి నాడు పౌరాదేవికి చేరుకుంటారని భక్తులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని రాజులగూడ గ్రామానికి చెందిన ఆడే కిషన్ బాధిత కుటుంబానికి ప్రభుత్వం పరంగా సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. కాగా మంగళవారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, పార్టీ నాయకులతో కలిసి రూ.50వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు అన్ని రకాలుగా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, నాయకులు రాథోడ్ ఉత్తమ్, షేక్ దాదేఅలీ, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, బిరిజులాల్, నర్సింగ్ మోరే, రాథోడ్ దత్తారాం, రాథోడ్ బిక్షపతి, ఏఎంసీ డైరెక్టర్ జాదవ్ కైలాస్, దుర్గె కాంతారావ్ ఉన్నారు.

పీఏసీఎస్ సీఈఓకు సన్మానం



నవతెలంగాణ-నేరడిగొండ

బోథ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యదర్శి మునిగెల నర్సయ్య ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా మంగళవారం బోథ్ మార్కెట్ సభ్యులు నేరడిగొండ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యులు కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సీఈఓలు గోలి స్వామి, బారే నాగభూషన్ మాట్లాడుతూ ఇంత కాలంగా తమతో మమేకమై ఉండి ఉద్యోగ విరమణ పొందినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో శేషా జీవితాన్ని సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్, నేరడిగొండ, సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు చివరి రోజు

నవతెలంగాణ-బేల

కాకతీయ విశ్వ విద్యాలయ పరిధిలో డిగ్రీ రెండు, నాలుగు ఆరు సెమిస్టర్‌లు చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లింపునకు చివరి తేదీ ఏప్రిల్-2 అని, ఇప్పటికే పొడిగింపు అయినప్పటికీ చాలా మంది విద్యార్థులు ఫీజు చెల్లింపు చేయలేదని, వెంటనే సకాలంలో ఫీజు చెల్లించి ఇబ్బందులు పడకుండా పరీక్షలకు ప్రిపేర్ కావాలని కీర్తన డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వరప్రసాద్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | ఏప్రిల్ 02, 2025 | www.navatelangana.com

హనుమాన్ భక్తుల ఏకాదశ దీక్షలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 500 మంది హనుమాన్ భక్తులు ఏకాదశ దీక్షలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు శిరీష్ శర్మ గణపతి నవగ్రహ పూజ చేసి అనంతరం అభిషేకం నిర్వహించారు. శ్రీనివాస్ శర్మ, శేఖర్ శర్మ, మహేష్ శర్మల వారికి మాలధారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడు నిత్య జీవితంలో అనేక తప్పులు చేస్తాడని, అటువంటి నిత్యజీవిత తప్పులకు దూరంగా ఉండటంతో పాటు దేవునిపై మనసు లగ్నం చేసే విధంగా దీక్ష ఉపయోగపడాలన్నారు. దీక్ష కాలంలో నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, వివేక్, రమేష్, వెంకన్న, రవి భక్తులు పాల్గొన్నారు

నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి ఖైరిగూడ

నవతెలంగాణ-రెబ్బెన



2024-2025 ఆర్థిక సంవత్సరానికి బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుందని ఇన్‌చార్జి జీఎం నరేందర్, ఖైరగూడ పీఈ వీరన్న మేనేజర్ జరపాల శంకర్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పర్సనల్ ఆఫీసర్ రజినీ సేఫ్టీ ఆఫీసర్ నారాయణ తెలిపారు. సింగరేణి సంస్థ ఏరియాకు 4.70 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా 5.43 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 116% చేరుకుందన్నారు. అధికారులు, కార్మికులు సమష్టి కృషితో రానున్న రోజుల్లో సంస్థ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని సాధించిపెట్టిన ప్రతి కార్మికునికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్
- నిరసనగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కాగజ్‌నగర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల భూముల వేలం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనివారపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. ఈ భూముల పరిరక్షణ కోసం పోరాడుతున్న విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పోరాటాన్ని అణచివేసేందుకు ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎర్రం నవీన్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి అర్ధరాత్రి వరకు ఎక్కడ ఉన్నాడో చెప్పకుండా హింసించి రిమాండ్ చేశారని అన్నారు. రిమాండ్ చేసిన వారిపై ఉన్న కేసులను తక్షణమే ఎత్తివేయాలని, వారిని విడుదల చేయాలన్నారు. యూనివర్శిటీలో దింపిన పోలీసు బలగాలను వెనక్కి పిలవాలని డిమాండ్ చేశారు. కార్పోరేట్ శక్తులకు భూములను అమ్ముతున్న రాష్ట్ర ప్రభుత్వం, ఇపుడు హెచ్‌సీయూ భూములను కూడా అమ్మేందుకు పూనుకుంటోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయికృష్ణ, ఉపాధ్యక్షులు తుమ్మిడె భీమేష్, సతీష్, సహాయ కార్యదర్శులు సుంకరి సాయికృష్ణ, నితీష్ పాల్గొన్నారు.

సీపీఐ (ఎం) నాయకుల అరెస్ట్

హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) హైదరాబాద్‌లో న్విరహించ తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా మంగళవారం తెల్లవారుజామునే స్థానిక నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలం చింతగూడ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నాయకుడు ముంజం ఆనంద్‌కుమార్‌ను కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్ట్‌లతో ఉద్యమాలు ఆగవని, యూనివర్శిటీ భూములు యూనివర్శిటీకి అప్పగించేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.

ఆసిఫాబాద్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులపై లాఠీచార్జీని నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైపోయిందని, విచ్చలవిడిగా భూములను ఆక్రమించుకుంటున్నారన్నారు. చివరికి విద్యాసంస్థల భూములనూ వదలడంలేదన్నారు. ఉత్తర భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలలో హెచ్‌సీయూ ఒకటన్నారు. అలాంటి యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, టీకానంద్, పాల్గొన్నారు.

సీఐటీయూ, పీడీఎస్‌యూ నాయకుల ముందస్తు అరెస్టు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై లాఠీచార్జీ, క్యాంపస్ భూములు లాక్కోవడాన్ని నిరసిస్తూ చలో హెచ్‌సీయూ కార్యక్రమం తలపెట్టిగా, నిరసనకు వెళ్లకుండా సీఐటీయూ, పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విలువైన భూములను రేవంత్ ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటుందన్నారు. ఇది ముమ్మాటికి అప్రజాస్వామికమైన చర్యన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం విద్యార్థులకు సరైన వసతులు, పరిశోధన కేంద్రాల కోసం వినియోగించుకోవాల్సిన 400 ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల పేరుతో, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెబుతూ యూనివర్సిటీ భూములను బడా కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడానికి పూనుకుందన్నారు. దీని మూలంగా భవిష్యత్‌లో క్యాంపస్‌లో చదివే విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా విద్యార్థులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆదివారం శాంతియుతంగా ఆందోళన చేస్తుండగా వారిపై లాఠీచార్జీ చేయడం దారుణమన్నారు. వెంటనే భూముల వేలం నిలిపివేయాలన్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో విద్యార్థులతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వాంకిడి : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆక్రమించుకొని వేలం వేసేందుకు సిద్ధమైందని, ఇట్టి భూములను కాపాడాలని సీపీఐ ఎంఎల్‌రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులు ప్రభుత్వ ఆక్రమణకు గురైన భూముల వద్దకు వెళ్లగా వారిని అరెస్ట్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని, 400 ఎకరాలను ఆక్రమించిన పక్షంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.



ఆసిఫాబాద్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

మతిస్థిమితం లేని మహిళకు చేయూత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతిరోజు ఉద్యోగ ఒత్తిడితో పనిచేస్తూ ఎదుటివారి పాలిట కఠినంగా వ్యవహరించే పోలీసులు మానవత్వం చాటుతారని మరోసారి నిరూపించారు. స్థానిక ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పోలీసులు విధులు నిర్వహిస్తున్న సందర్భంలో అక్కడ గుర్తు తెలియని మతిస్థిమితం లేని వృద్ధురాలిని పోలీసులు గమనించారు. వెంటనే ఆమెకు కావలసిన ఆహారం ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ మానసిక రోగుల ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ వృద్ధురాలు పరిస్థితి చూసి చలించి పోయామన్నారు. ఆమెకు పరీక్షలు చేయించి ఆసుపత్రికి తరలించనట్లు తెలిపారు. అయితే గత కొన్ని రోజులుగా వద్ధురాలు అక్కడే ఉండడం అనేక మంది చూసినప్పటికీ ఎవరు స్పందించకపోవడం, ఇదే సమయంలో స్థానిక ఎస్సై స్పందించడం పట్ల పలువురు ఆయన ఔదార్యాన్ని అభినందిస్తున్నారు.

యూపీఐ చెల్లింపు కష్టాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత కొంతకాలంగా పేపర్ కరెన్సీ తగ్గి యూపీఐ చెల్లింపులు పెరగగా మంగళవారం జిల్లాలో ఈ విధానం వినియోగదారులకు కష్టాన్ని తెచ్చి పెట్టింది. సోమవారంతో ఆర్థిక సంవత్సరం ముగియడం వరుసగా ఆది, సోమవారాలు సెలవులు రావడం, ఏప్రిల్ ఒకటిన బ్యాంకులకు సాధారణ సెలవు దినం కావడంతో యూపీఐ సేవలు ఫోన్ పే, గూగుల్ పే పనిచేయలేదు. దీంతో బ్యాంకు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై బ్యాంకర్లను అడగగా ఆర్థిక సంవత్సరం ప్రారంభం తేదీ కావడం, బ్యాంకుల లావాదేవీలు పూర్తిస్థాయిలో ముగియకపోవడం, బ్యాంకులకు సెలవు ఉండడంతో అవి పని చేయలేదని మంగళవారం రాత్రి వరకు యధావిధిగా పని చేస్తాయని తెలిపారు. ఏది ఏమైనా యూపీఐ వినియోగదారులు మాత్రం కష్టాలు ఎదుర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-రెబ్బెన

నిరుద్యోగ యువత కిమ్స్ ఫౌండేషన్ అండ్ రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కూడా కల్పించడం జరుగుతుందని బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటన పేర్కొన్నారు. మూడు నెలల పాటు సికింద్రాబాద్‌లో ఉచిత శిక్షణ అందిస్తారని, జనరల్ డ్యూటీ, అసిస్టెంట్ బిల్లింగ్ కోర్సుకు ఇంటర్ పాస్ లేదా ఫెయిలైన 18 ఏళ్ల నుండి 29 ఏళ్ల వయస్సు యువత, హాస్పిటల్ బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్ కోర్సు కోసం ఏదైనా డిగ్రీ పాసై 18 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కిమ్స్ ఫౌండేషన్ సెంటర్ 8019816641,7287819562 లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అర్హులకు సన్న బియ్యం పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా అర్హత గల ప్రతి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్‌లతో కలిసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల అధికారులతో సన్నబియ్యం పింపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులతో పంపిణీ కార్యక్రమం ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి చౌక ధరల దుకాణం వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు.

తాగు నీటి సమస్యను పరిష్కరించండి

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల వేదిక జిల్లా చైర్మన్ రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పాటగూడ, బాబేఝరి, శివగూడ గ్రామాలను ఆయన సందర్శించారు. గ్రామస్తులనడికి నీట సమస్యను తెలుసుకున్నారు. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైప్ లైన్ వేయకపోవడంతో ఆదివాసి ప్రజలు శుద్ధ జలానికి దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేతిపంపుల ద్వారా తాగునీరు సక్రమంగా రావడం లేదని, గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి గ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా కో కన్వీనర్ కోవ ఇందిరా పాల్గొన్నారు.

పెన్షన్ సవరణ బిల్లును విరమించుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సవరణ బిల్లును వెంటనే విరమించుకోవాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు నారాయణ, రమణయ్య, నాగేశ్వరరావు, కోటేశ్వర్, లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బిల్లును ఇదివరకే లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదింపచేసుకున్నారని, రాజ్యసభలో కూడా ఆమోదిస్తే కేంద్ర, రాష్ట్ర పెన్షనర్లకు, ఉద్యోగులకు ఆర్థికంగా తీవ్ర నష్టం జరిగే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు కూరగాయల మార్కెట్ బంద్‌కు పిలుపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణ కూరగాయల మార్కెట్ బంద్ వ్యాపారులు పిలుపునిచ్చారు. గత కొన్నేళ్లుగా మార్కెట్‌లో తైబజార్ రుసుం వసూలు చేయని మున్సిపల్ అధికారులు, ఈ ఏడాది ఈ రుసుం వసూలు చేసేందుకు నిర్ణయించి వేలం పాట నిర్వహించారు. దీనిని కూరగాయల వ్యాపారులు గత కొన్ని రోజులుగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌక్‌లో వ్యాపారులు నిరసన తెలుపగా, వీరికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సంఘీభావం తెలిపారు. వ్యాపారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ రుసుం వసులు చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు ఆందోళన చేపట్టేందుకు నిర్ణయించి, బుధవారం మార్కెట్ బంద్‌కు పిలుపునిచ్చారు.

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ

- ఎమ్మెల్సీ దండె విఠల్



కాగజ్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయమని, అందులో భాగంగానే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లో ఉన్న రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ డేవిడ్ (రెవెన్యూ), సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసే చారిత్రాత్మక పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈ పథకం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను అధికార యంత్రాంగం సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇందులో తహసీల్దార్ కిరణ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడం గణపతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వాంకిడి : సన్నబియ్యం పంపిణీ పథకంలో భాగంగా మండలంలో అన్ని రేషన్ దుకాణాల్లో మంగళవారం సన్నబియ్యం పంపిణీ చేశారు. ప్రతి ఒక లబ్ధిదారునికి తప్పనిసరిగా సన్నబియ్యం అందించాలని, ప్రతి డీలర్ ఒక్కో లబ్ధిదారునికి ఆరు కిలోల చొప్పున అందించడం జరుగుతుందని, డీలర్లు ఎవరైన అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ రియాజ్ అలీ తెలిపారు.

జైనూర్ : తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతినిరుపేదకు సన్నబియ్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ కుద్మేత విశ్వనాథ్‌రావ్ అన్నారు. మంగళవారం కేంద్రంలోని డీఆర్‌డీపోలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడికి పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో సన్నబియ్యం ఈపథకాన్ని ప్రారంభించిందన్నారు. ఒకరికి ఆరు కిలోల చొప్పున రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మందికి ఈ సన్నబియ్యాన్ని పంపిణీ చేయనుందన్నారు. ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే కార్యక్రమమన్నారు. ఏ ప్రభుత్వాలూ దీన్ని రద్దు చేయలేవన్నారు. పేదలు దొడ్డు బియ్యం తినలేరు, పీడీఎస్ బియ్యాన్ని మిల్లర్లు, దళారులు సైక్లింగ్ చేస్తున్నారన్న నేపథ్యంలోనే ప్రతి పేదవాడికి కడుపు నింపాలన్న లక్ష్యంతో సన్నబియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొట్నాక దౌలత్, దండుగుల మహేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు సుద్దాల ఆనంద్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



జైనూర్‌లో..

అనాథ బాలలకు జనభవిత ట్రస్ట్ రక్ష



నవతెలంగాణ-చింతలమానేపల్లి

జనభవిత ట్రస్ట్ అనాథ పిల్లలకు రక్షగా, అండగా నిలుస్తుందని ట్రస్ట్ ప్రెసిడెంట్ డోంగ్రే సురేష్ అన్నారు. మండలంలోని రుద్రపూర్ గ్రామానికి చెందిన ఎన్నం సోని నెల రోజుల క్రితం టీబీ వ్యాధి భారినపడి మృతి చెందింది. ఆమెకు అభి, నందిని అనే ఇద్దరు పిల్లలున్నారు. అమ్మమ్మ ఇంట్లో ఉంటూ అభి, నందిని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు కోల్పోయి ఇద్దరు పిల్లలు అనాథగా మారిన ఈ విషయం తెలుసుకున్న జనభవిత ట్రస్ట్ సభ్యులు మంగళవారం అనాథ పిల్లలు పరామర్శించారు. వాళ్ల ఇద్దరికీ విద్యా పరంగా ఉన్నత చదువులు చదవడానికి సహకారం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఉన్నత అధికారులతో ఈ విషయాన్ని సంప్రదించి తగు న్యాయం చేస్తామన్నారు. ట్రస్ట్ అనాథలకే కాకుండా నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటుందని, విద్యా, ఆరోగ్య, ఆర్థిక సాధికారిత అనే అంశాల మీద పనిచేస్తుందని పేర్కొన్నారు. ఇందులో ట్రస్ట్ సభ్యులు కుమ్మరి శ్రీనివాస్, దుర్గం విజయ్ కుమార్, జంగపులి మహేందర్, సృజన్, వందన పాల్గొన్నారు.

ఆరె కులస్తులను జాతీయ ఓబీసీలో చేర్చాలని వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఆరె కులస్తులను జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చాలని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్‌ను సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కోరారు. మంగళవారం న్యూ ఢిల్లీలో ఆయనను కలిసి మాట్లాడారు. తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఆరె కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నారని, వారిని తెలంగాణ ప్రభుత్వం బీసీ(డి)గా గుర్తించి సర్టిఫికెట్‌లు జారీ చేస్తోందని వివరించారు. జాతీయ ఓబీసీ జాబితాలో వీరు లేకపోవడంతో జాతీయ విద్యా, ఉపాధి సంస్థలలో అవకాశాలు లేక నష్టపోతున్నారని వివరించారు. దీనికి రాజ్యసభ సభ్యుడు స్పందిస్తూ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ దీనిని ఇది వరకే కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిందనీ, కేంద్ర కేబినెట్ ఆమోదంతో త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని చెప్పినట్లు ఎమ్మెల్యే హరీష్‌బాబు తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణను ప్రారంభించిన కోనప్ప



నవతెలంగాణ-బెజ్జూర్

ప్రజలకు సేవ చేయడంలో ఓడిన గెలిచిన తానే ముందుంటానని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని బెజ్జూరు, కుంటలమానేపల్లి గ్రామాల్లో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల మండలంలో యువకులు, విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. గతంలో విద్యార్థులకు 40 ల్యాప్‌టాప్‌లు, ప్రభుత్వ పాఠశాలలో 100 కలర్ టీవీలు, మహిళలకు 600 కుట్టు మిషన్లు, అంబులెన్స్ అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైతన్య ఫౌండేషన్ చైర్మన్, సభ్యులను అభినందించారు. గతంలో డీఎస్సీ శిక్షణ, చలికాలంలో రగ్గులు అందజేసినట్లు తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమన్నారు. కంప్యూటర్ శిక్షణను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుమూల సలుగు పల్లి, సోమిని గ్రామాల్లో మరికొన్ని కేంద్రాలు ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తాను తెలిపారు. బెజ్జూరులో కుట్టుశిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా చైతన ఫౌండేషన్ సభ్యులు సురేష్, కృష్ణారావులు మాట్లాడుతూ సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే సహకారంతో కంప్యూటర్ శిక్షణ, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కోనేరు కృష్ణారావు, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మంతయ్య, ఐకేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, మహిళా మండలి అధ్యక్షురాలు అమృత, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు బషరత్ ఖాన్, మాజీ సింగల్ విండో చైర్మన్ డోకే వెంకన్న, మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు లంగారి శ్రీనివాస్, గురజాల వెంకన్న, మాజీ సర్పంచులు రవికుమార్, హనుమంతు, బుజాడి శేఖర్, నాయకులు పుల్లూరు సతీష్‌కుమార్, టీ.మహేష్, చంద్రశేఖర్, నైతం సత్తయ్య, జావిద్ అలీ, అమీర్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ అండ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేద ప్రజల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ అండగ ఉంటుందని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా వాటిని ఆయా లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి అండగా నిలిచే సీఎంఆర్‌ఎఫ్ డబ్బుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సెడ్మకి ద్రుపతబాయి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | ఏప్రిల్ 02, 2025 | www.navatelangana.com

ఇతర కేసుల్లో ప్రమేయం ఉంటే కఠిన చర్యలు

● జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-జైపూర్



రౌడీషీటర్లుగా గుర్తించబడిన వారు సత్ప్రవర్తన కలిగివుండాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల పరిధిలో గుర్తించబడిన రౌడీషీటర్లను మంగళవారం జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో హాజరుపర్చారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి కేసుల్లోనైనా మీ ప్రమేయం ఉన్నట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సంధర్భంగా శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌తో కలిసి రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఎస్ఐ శ్రీధర్, భీమారం ఎస్ఐ శ్వేత, జైపూర్ అదనపు ఎస్ఐ నాగరాజు ఉన్నారు.

అలా ప్రారంభించారు.. ఇలా నిలిపేశారు..!

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం అట్టహాసంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం అలా ప్రారంభించి, ఇలా నిలిపివేయడం పట్ల లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. మంగళవారం మండలంలోని కొన్ని రేషన్ షాపుల్లో పలువురు కాంగ్రెస్ నాయకులు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇలా ప్రారంభించారో లేదో రేపు ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, అప్పటి వరకు నిలిపి వేయాలని ఆదేశాలు రావడంతో వెంటనే రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ నిలిపివేశారు. ఎంతో ఆశగా వచ్చిన లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. కాని అట్టహాసంగా ప్రారంభించి ఇలా నిలిచిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు, ప్రజల్లో నవ్వుల పాలయ్యారు. సన్న బియ్యం పంపిణీ విషయమై తహసీల్దార్ భోజన్నను వివరణ కోరగా ఎమ్మెల్యే చేతుల మీదుగా అధికారిక ప్రారంభోత్సవం చేయనున్నట్లు పైఅధికారులు తెలపగా సాధారణంగా నిలిపివేసినట్లు తెలిపారు. దీనిపై ఎటువంటి ఆంక్షలు లేవని, ప్రజలకు సమయానుగుణంగా యధావిధిగా బియ్యం సరఫరా ఉంటుందని తెలిపారు.

ఇక నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

ఇక నుంచి రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పథకం ప్రారంభమైదని, దొడ్డు బియ్యం ఇస్తే ఎవరు తీసుకోవద్దని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ పథకానికి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని జీసీసీ చౌక ధరల దుకాణంలో తెల్ల రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉగాది కానుకగా రాష్ట్ర వ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.50 ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, ఆర్ఐ గంగరాజా, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మాజీ చైర్మన్ ముత్యం సతీష్, మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, రియాజుద్దీన్, దాముఖ కరుణాకర్. నందు నాయక్, ఏవీఆర్, రమేష్ ఇసాక్ ఇందయ్య, మత్స్య శంకరయ్య, ఇసాక్, రాజన్న, గంగన్న, అజారుద్దీన్, బండారి స్వామి పాల్గొన్నారు.

జైపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అంచెలంచెలుగా అమలు చేస్తుందని పార్టీ మండల అధ్యక్షులు మహ్మద్ ఫయాజోద్దీన్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకరి శ్రీనివాస్, గడ్డం ప్రసాద్, చిప్పకుర్తి దుర్గయ్య, ఆసంపల్లి మల్లేష్, నల్లి శ్రీకాంత్, సతీష్‌లతో కలిసి మంగళవారం ఇందారం గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మన్ సీనియర్ నాయకులు అంబల్ల రవి కల్కి రమేష్, సంపత్ రెడ్డి, కటుకూరి సత్యం మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ చేశారు.

తాండూర్ : మండలంలోని మాదారంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డితో కలిసి సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పథకం వల్ల నిరు పేదలు లబ్ధి పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపర్తి సుభాష్, సూరం దామోదర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. తాండూర్‌లో ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ పులగం తిరుపతి, సంగ బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎస్ మహేందర్‌రావు, మాజీ జడ్పీటీసీ బానయ్య మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాస వెంకటస్వామి పాల్గొన్నారు.



జన్నారంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

లక్షెట్టిపేట : రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ గ్రామన మంగళవారం అధికారాకంగా ప్రారంభించారు. రేషన్ షాపుల వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర రావు, సీఎం రేవంత్‌రెడ్డికి పేదల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణచెందర్ రావు, చింత అశోక్‌కుమార్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు అంకతి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పింగళి రమేష్, మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, యూత్ అధ్యక్షుడు బొప్పు సుమన్, రాందేని చిన్న వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్ట్ తోట రమేష్, మాజీ కౌన్సిలర్ రాందేని వెంకటేష్, అరిగేల చెందు, భూమేష్, అమీర్, హాజీ గోపతి రమేష్, చతరాజు రాజేష్ పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్ద సంబరాలు

మందమర్రి : రేషన్ కార్డ్ దారులకు సన్న బియ్యం పథకాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించి సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం అంగడి బజార్ ఏరియాలో రేషన్ షాప్‌లో ఉచిత సన్న బియ్యం పథకాన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సొతుకు సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న గపత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. ఎంతోమంది సీఎంలు వచ్చి పోయారు కాని ఏ సీఎం కూడా సన్నబియ్యం ఇవ్వలేదని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఉగాది నుంచి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పి మాట నిలుపుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, పుల్లూరి లక్ష్మణ్, గడ్డం రజిని, మంకు రమేష్, నెరవేట్ల శ్రీనివాస్, మంద తిరుమల్, ఎండీడి సుకూర్, జమీల్, రాజు, రాచర్ల రవి, బుర్ర ఆంజనేయులు, సోతుకు ఉదయ్, సట్ల సంతోష్, రాచర్ల గణేష్, రాయబారపు కిరణ్, మాయ తిరుపతి, బండి శంకర్, వీరన్న, నరసయ్య రావుల శ్రీనివాస్, రాజయ్య లింగయ్య పాల్గొన్నారు.



జైపూర్‌లో..



జైపూర్ : ఇందారంలో..



తాండూర్‌లో..



లక్షెట్టిపేటలో..



మందమర్రిలో..

హెచ్‌సీయూ భూముల అమ్మకాలు ఆపాలి



నవతెలంగాణ-జన్నారం

హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూములు అమ్మకాలను ఆపాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్, నాయకులు అంబటి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులను హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలించడం చేతగాక ప్రభుత్వ భూములను అమ్మడం సరికాదన్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేర అన్నారు. హెచ్‌సీయూ 400 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేసి అమ్మి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని చూస్తే ఊరుకోమన్నారు. వేలం పాటలను రద్దుచేసి భూమిని అమ్మకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులా..?

● బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేష్



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజల పక్షాణ ప్రశ్నించిన నాయకులపై అక్రమంగా కేసులు పెట్టిస్తున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేష్ అన్నారు. మంగళవారం చెన్నూర్ మున్సిఫ్ కోర్టుకు హాజరైన ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించిన 17 మంది బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు 6 గ్యారంటీలు, ప్రధానంగా రైతన్నలను మోసం చేసిన తీరుపై బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుందని విమ్మర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను రాష్ట్ర ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని గత ప్రభుత్వ హాయంలో జరిగిన అభివృద్ధి అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజల్లో విశ్లేషన మొదలైందని, అన్యాయంగా బీఆర్ఎస్ నాయకులపై నమోదవుతున్న కేసులు ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, రైతు భరోసా, రైతు రుణ మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని ఈ సంధర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామ్‌లాల్ గిల్డా, నవాజ్, సాదనబోయిన కృష్ణ, మల్లెల దామోదర్, రేవెల్లి మహేష్, మేడ సురేష్‌రెడ్డి, బుర్ర రాకేష్‌గౌడ్, షఫీ, కొప్పుల రవీందర్, బోగ భారతి, కొండపర్తి వెంకట రాజ్యం పాల్గొన్నారు.

రిజర్వేషన్లను ఎత్తివేసేందుకే వర్గీకరణ బిల్లు



నవతెలంగాణ-నస్పూర్

షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లను ఎత్తివేయాలనే కుట్రలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించారని, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.నర్సింగ్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ స్కూల్‌లో బింగి సదానందం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం యూత్ విభాగం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మతోన్మాద బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ చేతిలో కీలుబొమ్మగా మారి ఎస్సీ వర్గీకరణ పేరుతో విభజించి పాలిస్తూ, దళితుల ఐక్యతను దెబ్బతీస్తూ, మనువాదాన్ని ముందుకు తీసుకెళ్లితూ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నరన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నరేంద్ర మోడీ అడుగులకు మడుగులొత్తుతు ఎస్సీ వర్గీకరణ చేయాలని పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగను వారి ప్రయోగశాలలో ఒక వస్తువుగా వాడుకుంటున్నారనే నగ్న సత్యాన్ని తెలిసి కూడా వారి స్వార్థ రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం ఎస్సీ వర్గీకరణ కావాలని అసెంబ్లీలో బిల్లు పెట్టే విధంగా ఆ బిల్లును ఆమోదించేలా చేయడం దళితుల ఐక్యతను దెబ్బ తీయడం ముఖ్యంగా మాల, మాల ఉపకులాలకు అన్యాయం చేయడమేనని అన్నారు. ఈ రాష్ట్రంలో ఎస్సీ కులాల జనాభా లెక్కలు లేవని 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేయడం బీజేపీ రాజకీయంగా కుట్ర చేసిందని అన్నారు. ఓట్ల రాజకీయ కోసం మాత్రమేనని ఇకనైనా రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న వర్గీకరణ ఆమోద బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రక్షణ కమిటీ సభ్యుడిగా నాతాడి శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

అఖిల భారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల సమస్యల సాధనకు ఇన్‌చార్జిలను ఎన్నుకున్నట్లు ఏబీకేఎంఎస్(బీఎంఎస్) ప్రధాన కార్యదర్శి సుజిత్ సింగ్ ఆదేశాలు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగానే రక్షణ కమిటీ సభ్యుడిగా సింగరేణి వ్యాప్తంగా రక్షణ కమిటీ సభ్యుడిగా నాతాడి శ్రీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాతాడి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సింగరేణి విభాగం నుంచి మొదటిసారిగా రక్షణ కమిటీ సభ్యునిగా నాపై నమ్మకం ఉంచి ప్రోత్సహిస్తున్న కొత్త కాపు లక్ష్మారెడ్డి, యాదగిరి సత్తయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పదంగా అంగన్‌వాడీ టీచర్ మృతి

నవతెలంగాణ-మంచిర్యాల

అనుమానాస్పద స్థితిలో అంగన్‌వాడీ టీచర్ మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన దుర్గం వజ్రమ్మ(46) స్థానిక శ్రీశ్రీనగర్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తూ నివాసం ఉంటుంది. కుటుంబ సమస్యలతో గత 20 సంవత్సరాలుగా వజ్రమ్మ కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటోంది. మంగళవారం ఉదయం వజ్రమ్మ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు కిటికీలోంచి చూడగా బెడ్‌పై పడిపోయి ఉండడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి తల్లి దుర్గం మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్తయ్య తెలిపారు. వజ్రమ్మ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గ్రూప్-1లో జన్నారం వాసికి 161 ర్యాంక్

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీకి చెందిన నగురు హరిదాస్ భాగ్యలక్ష్మి దంపతుల మూడో కొడుకు అనిల్ కుమార్ రాష్ట్రస్థాయిలో ఇటీవలే వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో 161 ర్యాంక్ సాధించారు. గతేడాది గ్రూపు-4లో ఎంపికైన అనిల్ కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. తన తండ్రి హరిదాస్ ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేశారు. పదేండ్ల క్రితమే ఆనారోగ్యంతో మృతి చెందాడు. అనిల్ కుమార్ సోదరుల్లో పెద్దవాడైన అరుణ్ కుమార్ ఆర్టీసీ డ్రైవర్‌గా, రెండో సోదరుడు అజయ్ కుమర్ ట్రాన్స్ కోలో అసిస్టెంట్ ఏఈగా పనిచేస్తున్నారు. అనిల్ కుమార్‌కు గ్రూప్-1లో 161 ర్యాంక్ రావడంతో ఉన్నత స్థాయిలో ఉద్యోగం వస్తుందని ఆ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఓదేలుకు పరామర్శ



నవతెంగాణ-జైపూర్

గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు చికిత్స పొందుతున్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలును సిట్టింగ్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పరమార్శించారు. హైదరాబాద్‌లో గల బ్రీనోవా ట్రాన్స్‌లేషన్ కేర్ ఆస్పత్రిలో కలిశారు. ఆరోగ్య స్థితిగతులు అడిగి తెల్సుకున్న ఎమ్మెల్యే వివేక్ ఆస్పత్రి వైద్యులతో మాట్లడారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించారు.

ఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-మంచిర్యాల

నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అదజేస్తున్న స్వయం ఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశ పెట్టారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతకు ఈ పథకం వర్తింప చేస్తోందని అన్నారు. అర్హులైన వారు ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రూ.50 వేల లోపు రుణం 100 శాతం మాఫీ, రూ.1 లక్ష లోపు రుణం 90 శాతం రాయితీ, రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందని, రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణాల ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతిరోజు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. లేఅవుట్ క్రమబద్ధీకరణలో భాగంగా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపుదారులకు అవగాహన కల్పించి, సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



మంచిర్యాల : మున్సిపల్ కార్యాలయంలో పరిశీలిస్తున్న కలెక్టర్

ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

జైపూర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం కోసం ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో అందిన ధరఖాస్తులను వెంటనే అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన రాజీవ్ యువ వికాస్ పథకం అందుతున్న ధరఖాస్తులను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణతో మాట్లాడుతూ ఆఫ్ లైన్‌లో అందిన ధరఖాస్తులను కార్యాలంయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో అందిన ధరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని, ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇకపై వచ్చే ధరఖాస్తులను సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల వారిగా వేరు చేసి తదుపరి కార్యాచరణకు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ పేమెంట్ చెల్లింపుదారులకు సరైన విధంగా అవగాహణ కల్పించాలని అదికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, ఏపీఓ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



జైపూర్ : ఎంపీడీఓ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లాలో దొంగల ముఠాపై అనుమానాలు

● భీమారం ఎస్ఐ శ్వేత

నవతెలంగాణ-జైపూర్

పక్క రాష్ట్రాలకు చెందిన కొంత మంది దొంగలు ముఠాలుగా ఏర్పడి జిల్లాలో సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని భీమారం ఎస్ఐ శ్వేత అన్నారు. భీమారం మండలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం ప్రచారం నిర్వహించారు. దొంగలు ఇంటి యజమానులు నిద్రిస్తున్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని, తాళం వేసివున్న ఇంటి తాళాలు పగులగొట్టి దోపిడికి పాల్పడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాలలో ఈ దొంగల ముఠాలు సంచరిస్తున్నట్లుగా తెలిసిందని అన్నారు. ఈ నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండటం అవసరమని హెచ్చరించారు. అనుమానస్పద వ్యక్తులు, మీకు తెలియనటువంటి వ్యక్తులు మీదగ్గరకు వచ్చినా.. మీరు చూసినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అంతేకాకుండా 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించినా వెంటనే పోలీసు సిబ్బంది అప్రమత్తం అవుతుందని తెలిపారు. కాగా ఏదేని పని మీద పక్క ఊరుకు వెల్లాల్సిన సమయంలో విధిగా మీ పొరుగు కుటుంబాల వారికి సమాచారం ఇవ్వడమే కాకుండా పోలీసులకు సమచారం ఇచ్చి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



భీమారంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌లో లక్ష్మీ పూజ

నవతెలంగాణ-నస్పూర్

2025-2026 ఆర్థిక సంవత్సరానికి మొదటి రోజు సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ తన కార్యాలయంలోని ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌లో మంగళవారం లక్ష్మీ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నూతన ఆర్థిక సంవత్సరంలో శ్రీరాంపూర్ ఏరియా ఆర్థికంగా ముందుకు దూసుకు వెళ్లాలని, ఆ లక్ష్మీదేవి కృపాకటాక్షాలు సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు అందరిపైనా ఉండాలని, అలాగే బొగ్గు ఉత్పత్తి ఉత్పతకత పెరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ జనరల్ మేనేజర్ సుసంతా సాహు, ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ బీభత్స, ఏజీఎం కుర్మ రాజేందర్, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్‌రావు, డీజీఎం(ప) పి అరవింద రావు, డీజీఎం ఐఈడి కే చిరంజీవులు పాల్గొన్నారు.



14వ రోజు సీసీఐ దీక్షలో జోగు ఫౌండేషన్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలు మంగళవారం నాటికి 14వ రోజుకు చేరుకోగా జోగు ఫౌండేషన్ నాయకులు కూర్చున్నారు. వారికి సీపీఐ(ఎం) నాయకులు లంక రాఘవులు, బీఆర్ఎస్ బీసీ సంఘం నాయకులు దాసరి రమేష్, జోగు ఫౌండేషన్ కార్యదర్శి కొరెడ్డి ప్రవీణ్ మద్దతు తెలిపారు. వీరికి



సీసీఐ సాధన కమిటీ కోకన్వీనర్ లోకారి పోశెట్టి, అరుణ్ కుమార్, బండి దత్త్రాత్రి, కొండ రమేష్ పూలమాలలు వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కొరెడ్డి ప్రవీణ్, నాయిడి నర్సారెడ్డి, బొజ్జ గంగారాం, అరిఫాబేగం, కస్తూరి పరమేశ్వర్, జక్కుల కార్తీక్, మగ్గెని రమేష్, అనిల్, తాటిపెల్లి చెంతన్, స్వప్నిక్, మంచాల అనిల్, సాయి ప్రశాంత్, ఆశన్న, నెల్ల స్వామి పాల్గొన్నారు.

ఆదివాసులతో పోలీసుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని కేబీ కాంప్లెక్స్ పీఎమ్మార్సీలో మంగళవారం ఆదివాసులతో ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఆదివాసుల పెద్ద మనుసులు ముందుండి తమ పిల్లలకు చదువును చదివించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలన్నారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ, డీస్పీ, సీఐ, ఎస్సై, పోలీసులు ఆదివాసీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకోం

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



ఆదిలాబాద్‌టౌన్ : దిష్టి బొమ్మ దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ అన్నారు. మంగళవారం కార్యాలయం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను 400 ఎకరాలను వేలం వేసి, ఇతర ప్రయివేట్ కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విద్యార్థులు మా భూములు మాకు కావాలనీ శాంతియుతంగా ధర్నాలు చేస్తుంటే రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపైన అక్రమంగా లాఠీ చార్జి చేపిస్తూ వారిని అరెస్టులు చేపిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన నడిచేది లేక ప్రయివేట్ కార్పొరేట్ పాలన అని తాము అడుగుతున్నామన్నారు. ఒక దిక్కు రాష్ట్రంలో ప్రయివేట్ యూనివర్సిటీలొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను ధ్వంసం చేస్తుంటే ఇప్పుడున్న ప్రభుత్వం ప్రభుత్వ యూనివర్సిటీలను నాశనం చేసే విధంగా ఆలోచన చేస్తుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ఇబ్బందులు పడుతున్న ప్రజల రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్‌షిప్‌లను, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యూనివర్సిటీలకు అధిక నిధులు కేటాయించి, వాటిని అభివృద్ధి చేయాలన్నారు. ఇలాంటివి చేయకుండా ప్రభుత్వ ధనాన్ని ప్రయివేట్ కార్పొరేట్ కంపెనీలకు రేవంత్‌రెడ్డి దోచిపెడుతున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన మానుకొని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పి, ఆ భూముల జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని యూనివర్సిటీలలో జిల్లా కేంద్రాలలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నక్క సాయి, యమున, రమ్య, దివ్య, అఖిల్, కళ్యాణ్‌రామ్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం...

నిర్మల్‌టౌన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం జరుగుతున్న విద్యార్థుల పోరాటాన్ని అణచివేయడానికి, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులపై జరుగుతున్న అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ, సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ మాట్లాడుతూ హెచ్‌సీయూ గేటు వద్ద నిర్వహించాల్సిన ధర్నాకు సీపీఐ(ఎం) పార్టీ నాయకులను ముందస్తుగా అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి ఎదురుదెబ్బ అని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ఉద్యమాలను అణచివేయడంలో పాలుపంచుకుంటున్న తీరును విమర్శించారు. ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా అధికారం నిలుపుకునే ప్రయత్నాన్ని ప్రజలు సహించరని హెచ్చరించారు. ప్రధానగా 400 ఎకరాల భూమిని విక్రయించాలనే ప్రణాళికను తక్షణం విరమించుకోవాలని అన్నారు. విద్యార్థుల పోరాటాలపై పోలీసు నిర్బంధాన్ని, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థులను, సీపీఐ(ఎం) నాయకత్వాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇది విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యగా, ప్రభుత్వ నియంతృత్వ ధోరణిగా అన్ని ప్రజాస్వామ్యవాదులు దీనిని ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఫసిఉద్దీన్, పోశెట్టి, డాకూరు తిరుపతి ఉన్నారు.



నిర్మల్‌టౌన్ : ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కోసాయి, దేగామ పాఠశాలలో పనిచేసిన సంజీవరెడ్డి ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ పొందడంతో మంగళవారం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పలు సంఘాల నాయకులు పాఠశాల ఆవరణలో ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా హాజరైన వక్తలు మాట్లాడుతూ సంజీవరెడ్డి పనిచేసిన పాఠశాలలో తన కర్తవ్యంగా భావించి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో గల పేద ప్రజల పిల్లలకు చదువు నేర్పలని అంకిత భావంతో పనిచేశారని అన్నారు. తను పనిచేసిన పాఠశాలలో విద్యార్థులు గైర్హాజరు కావడం చూసి విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను బడికి తీసుకువచ్చే వారన్నారు. అనంతరం సంజీవరెడ్డి మాట్లాడుతూ తన ఉపాధ్యాయ వృత్తి ధర్మంలో వివిధ పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందినప్పటికీ పాఠశాలలు విద్యార్థులే కండ్లలో మెలుగుతారన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు, ఉద్యోగ విరమణలు సర్వసాధారణమైనప్పటికీ ప్రతి ఒక్కరూ తన వృత్తి ధర్మాన్ని నెరవేర్చలన్నారు. పాఠశాల విద్యార్థులు అలరించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల లచ్చిరాం, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, ఎంఈఓ వెంకట్‌రావు, కేదారేశ్వర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి, టీయూటీఎఫ్ సంయుక్త కార్యదర్శి రామారావు, ప్రముఖ న్యాయవాది విద్యాసంస్థల అధినేత ముస్కు లింగారెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ బడాల రాంరెడ్డి, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్ 365వ వర్ధంతిని జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

దళిత బహుజన విప్లవ వీరుడు బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 365వ వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ అమరవేణి నర్సాగౌడ్, మోకుదెబ్బ జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధి రాములుగౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని గౌడ కులస్తులు రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామాలలో పట్టణాలలో వాడ వాడల పాపన్న చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాలని పేర్కొన్నారు. పాపన్న పోరాట చరిత్రను ప్రజలందరికీ వివరించి, బీసీలకు రాజ్యాధికారం వచ్చేవరకు ఉద్యమించాలని తెలియజేశారు.

సీపీఐ(ఎం) జాతీయ మహాసభలకు జిల్లా వాసి ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఐ(ఎం) జాతీయ మహాసభలకు పూసం సచిన్ ఎంపికయ్యాడు. ఏప్రిల్ 2 నుంచి 6 వరకు తమిళనాడు రాష్ట్రం మదురైలో జరిగే సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలకు ప్రతినిధిగా వెళ్లనున్నారు. సీపీఐ(ఎం)లో అత్యున్నతంగా భావించే అఖిల భారత మహా సభలకు ఎన్నిక కావడం పట్ల సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి, సీనియర్ నాయకులు లంక రాఘవులు, నాయకులు స్వామి హర్షం వ్యక్తం చేశారు.

గ్రామ సమస్యలన్నీ పరిష్కరిస్తా : ఎమ్మెల్యే అనిల్

నవతెలంగాణ-బోథ్

గ్రామ సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని కుచిర్యాల గ్రామంలో ఆయన పర్యటించారు. ముందుగా గ్రామంలో గల జగదాంబదేవి, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు మంజూరు చేసినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామంలో ప్రతి వాడలో సీసీ రోడ్లు నిర్మిస్తామని, త్వరలోనే బీటీ రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామని అన్నారు. ఒక్కొక్కటిగా గ్రామ సమస్యలు అన్ని తీర్చే బాధ్యత తనపై ఉందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి స్వామి, రైతు సంఘం మండల అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురేందర్, నాయకులు అల్లకొండ ప్రశాంత్, రూప్‌చంద్, రవి, సుధీర్, అభిలాష్, రమణగౌడ్, ప్రవీణ్, బాపురెడ్డి, సోమేశ్, రమణ, చిన్నయ, గోపాల్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని పాతకొమ్ముగూడెం గ్రామానికి చెందిన గడికొప్పుల రామయ్య (65) ఉరి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. మృతుడికి వరుసకు అల్లుడైన అదే గ్రామానికి చెందిన కొట్టే సత్తయ్య మతునితో తరచూ గొడవ పడుతూ ఇబ్బంది పెడుతుండేవాడు. రామయ్య గ్రామంలో ఎక్కడ కనిపించిన కోపంగా చూస్తూ బూతులుతిడుతూ ఎందుకు బతుకుతున్నావ్ చవుపో అంటుండేవాడు, అతని వేధింపులు తట్టుకోలేక ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కొడుకు మహేందర్ ఫిర్యాదు మేరకు కొట్టే సత్తయ్య పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుద్ఘాతంతో రెండు దుప్పులు మృత్యువాత

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని గంగిపల్లి-పెగడపల్లి అటవీ సరిహద్దులో పంట పొలం చుట్టూ అమర్చిన విద్యుత్ కంచెతో రెండు దుప్పులు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించగా మృతి చెందిన దుప్పుల మాంసంతో పాలమాకుల శ్రీనివాస్ రెడ్డి, గూడ పాపన్న పట్టుబడినట్లు మంచిర్యాల అటవీ క్షేత్ర అధికారి రత్నాకర్ తెలిపారు. నిందితుల నుండి దుప్పుల మాంసము, కొమ్ములు, చర్మం స్వాధీనం చేసుకున్నట్లు, ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యాశాఖ అధికారిణికి ఘనంగా వీడ్కోలు

- సన్మానించి జ్ఞాపికలు అందజేత



ఉద్యోగ విరమణ పొందిన డీఈఓ ప్రణీతకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో వేడుకలు నిర్వహించారు. ఆత్మీయ వీడ్కోలుకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, జనగామ జిల్లా విద్యాశాఖాధికారి ఏడి దర్శనం భోజన్న పాల్గొని, ఆమెను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషా డీఈఓను సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ ప్రతీ ఉద్యోగికి తప్పనిసరి అని గత మూడున్నర సంవత్సరాలుగా విద్యాశాఖలో సేవలందించి, అందరి మన్ననలను పొందారని, వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు వారి అనుభవాలను పంచుకున్నారు. శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని కోరారు. జిల్లా అధికారులు పాల్గొని ఆమెను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, జిల్లా అధికారులు ఎస్సీ సంక్షేమ అధికారిణి సునీత, డీపీఆర్‌ఓ తిరుమల, ఐసీడీఎస్ అధికారిని మిల్కా, జిల్లాలోని ఎంఈఓలు ప్రధానోపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెట్రోలింగ్ విధులు నిర్వర్తించిన మహిళా పోలీసులు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నారి శక్తి ప్రోగ్రాంలో భాగంగా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు మహిళా దినోత్సవం రోజు నుండి వారంలో ఒక రోజు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో మహిళా అధికారులతో పెట్రోలింగ్ డ్యూటీ మహిళా కానిస్టేబుళ్లు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం నిర్మల్ రూరల్‌లో మహిళా కానిస్టేబుళ్లు వాహనాలు తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఈ చలాన్స్ విధించారు. మహిళలు దేంట్లో తక్కువ కాదని, ఎలాంటి డ్యూటీ అయినా మగవారితో సమానంగా చేయగలరని నిరూపిస్తున్నారు.

డంపు యార్డ్‌ను వెంటనే తరలించాలి

నవతెలంగాణ-నస్పూర్

సీసీసీ ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద ఉన్న డంపు యార్డ్‌ను వెంటనే తరలించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు నివాసముంటున్న ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఉండడంతో కార్మికులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డంపు యార్డ్ ఉన్న ప్రాంతంలో ఆర్కే-5 కాలనీ, బ్యారెక్స్, సీసీసీ బంగ్లాస్, సింగపూర్ పునరావాస ప్రాంతంతో సహా పరిసర ప్రాంతాల నివాసితులకు ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ ప్రదేశంలో వేసిన చెత్తను దహనం చేయడంతో వాతావరణంలోకి హానికరమైన పొగ రావడం వల్ల కార్మికులు, ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. యాజమాన్యం కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యం దృష్ట్యా వెంటనే డంప్ యార్డ్‌ను ఇతర ప్రదేశానికి మార్చాలని డిమాండ్ చేశారు. డంప్ యార్డ్‌ను వెంటనే మార్చకపోతే పర్యావరణ బోర్డుకు ఫిర్యాదు చేస్తామని, ఆందోళనలు ఉధృతం చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ఫిట్ కార్యదర్శులు ఆకుల లక్ష్మణ్, సంగం సదానందం, గునిగంటి నరసింగారావు, సందీప్, నవీన్‌రెడ్డి, మారపల్లి సారయ్య, కుమారస్వామి, తిరుపతి, మూడ సుధాకర్, సాయిరాజు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు

పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్గివుండాలని మంచిర్యాలకు చెందిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రం అధికారులు తెలిపారు. మంగళవారం కుందారం శివారులో ఉపాధి హామీ కూలీలను కలిసి సామాజిక భద్రత పథకాల అమలు తీరును వివరించారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ రాజేశ్ మాట్లాడుతూ గ్రామంలో గల ప్రతి ఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని సూచిచారు. అదేవిధంగా సామాజిక భద్రత పథకాలైన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల పట్ల అవగాహణ కల్పించారు. బ్యాంకుల ద్వారా రుణ సదూపాయాలు, పొదుపు, డిజిటల్ సేవలు సైబర్ నేరాల నివారణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాల్లో సైబర్ మోసాలకు పాల్పడితే వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రజలు బ్యాంక్ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి జాడి పోచం ఆధ్వర్యంలో కాసిపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు దాగం మల్లేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు తీసుకోవాలన్నారు. ఐదేళ్ల కాలపరిమితి కలిగిన కార్డుతో కార్మికునికి ఎన్నో సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. లేబర్ కార్డు తీసుకునే విషయంలో ఎవరు కూడా నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ నెల 13న జరిగే జిల్లా మహాసభను వేలాదిమంది కార్మికులు హాజరై విజయవంతం చేయవలసిందిగా పిలుపు నిచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక

భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా జాడి పోషం, అధ్యక్షుడిగా బండారి సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా ఉప్పులేటి మధునయ్య, ప్రధాన కార్యదర్శిగా గంగాధరి రాజయ్య, సహాయ కార్యదర్శిగా భోగి సత్తయ్య, కోశాధికారిగా నల్ల శ్రీనివాస్, కాలువ రాజేష్, ఎస్కె మహబూబ్, దాసరి లింగయ్య 9 మంది కమిటీ సభ్యులు 19 మంది కార్యవర్గంతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దాడి గట్టయ్య, నియోజకవర్గ కార్యదర్శి కొంకుల రాజేష్, దాగం రాజలింగు, గట్టు సర్వేశం, దుర్గం పోశం, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆవునూరి రాజు, అధ్యక్షుడు రామగిరి వెంకన్న, ఉపాధ్యక్షుడు లింగంపల్లి లింగన్న పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బెట్టింగ్ గేమింగ్ అప్లికేషన్ల పట్ల ప్రజలు యువత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. యువత, విద్యార్థులు తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, ప్రజలు విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌లకు బానిసలుగా మారి, అప్పులపాల ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారని, ఆన్‌లైన్ బెట్టింగ్, ప్లే కార్డ్, గేమ్స్ కట్టడికి, ఐపీఎల్ బెట్టింగ్ పై కూడా జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లలు, వారి ప్రవర్తన పై నిఘా పెట్టాలని, ప్రతి రోజూ పిల్లలు వారు చేస్తున్న పనుల గురించి ఆరా తీయాలన్నారు. బెట్టింగ్ యాప్‌ల డౌన్‌లోడ్ ద్వారా ప్రజల వ్యక్తి గత సమాచారం, అకౌంట్ వివరాలు, సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్ళే అవకాశం ఉన్నందని, ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు బెట్టింగ్ సమాచారాన్ని అందించాలని, అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.